క్లుప్తంగా

అన్నదానం.. వస్త్రదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నగరి : కాశీబుగ్గ దేవాలయ సమీపంలోని కంచి కామరోటి పీఠంలో అన్నదాన సమాజం వారు మంగళవారం భక్తులకు అన్నదానం, వస్త్ర దానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రన్ , నిర్వాహకులు మణి ఆచారి, కన్నయ్య, రాజేంద్రన్, మోహన కృష్ణ పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన అవసరం



సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : మధ్యాహ్న భోజన నిర్వాహకులు ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈఓ శ్రీదేవి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని బాలిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో పోషకాలు అధికంగా ఉంటాయని, కడిగే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

నింద్ర : సేంద్రియ సాగుతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ఆర్‌బీకే చైర్మన్ వీరయ్యానాయుడు తెలిపారు. మంగళవారం అగరం గ్రామంలో నిర్వహించిన పొలంబడిలో ఆయన మాట్లాడారు. జీవామృతం తయారు చేసే విధానంపై వ్యవసాశాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లెమ్మ, రైతు వెంకటేశు పాల్గొన్నారు.

తిరుపతిలో పింఛన్ అందజేత



ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుధ

కార్వేటినగరం: మండల పరిధిలోని ఎల్ ఆర్ పేట పంచాయతీ వెంకటాద్రిపురం గ్రామానికి చెందిన ఎస్.నాగ భూషణమ్మ అనారోగ్యంతో బాధపడుతూ టాటా ట్రస్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలిసి వలంటీర్ సుధ తిరుపతిలోని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి అందిస్తున్న చంద్రయ్య

నగరి : విజయపురం మండలం జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబు, ఉపాధ్యాయులు భాగ్యరాజ్, వెంకటేష్, దశరథ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జయశ్రీ



నింద్ర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.జయశ్రీ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కర్నూల్ నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జయశ్రీ పాల్గొననున్నట్లు వెల్లడించారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి



మురుగేశన్ (ఫైల్)

నగరి : పట్టణంలోని అగ్నిమాపక కేంద్రలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న సి.మురుగేశన్(49) మంగళవారం గుండెపోటుతో ఇంటి వద్ద మృతి చెందాడు. నగరి దళితవాడకు చెందిన మురుగేశన్ 2004 నుంచి హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఆయన మృతికి అగ్నిమాపక అధికారి మస్తాన్ సంతాపం తెలిపారు.

సంక్షేమ సారథి.. పేదల పెన్నిధి

- బడుగుల పాలిట దేవుడు జగనన్న
- గతంలో లబ్ధిదారుడు చనిపోతేనే పింఛన్
- మా ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు ఇస్తున్నాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పింఛన్ పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: సంక్షేమ ఆద్యుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలోని అవ్వ, తాత, వికలాంగులు, వితంతువులు, మహిళలు నిరంతరం వారి కళ్లలో ఆనందం నింపడమే ధ్యేయంగా కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పేదవారి అభివృద్ధి కోసం జగనన్న కృషి చేస్తుంటే, చంద్రబాబు అవినీతి, బినామీల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అవినీతితో సంపాదించిన డబ్బుతో ఓటుకు రూ.10 వేలు పంచడానికి చంద్రబాబు నాయుడు, దత్తపుత్రుడు పవన్, ఎల్లో మీడియా ఏకమయ్యారని, వీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబు తనకు పిల్లనిచ్చిన మామతో పాటు ప్రజలను కూడా మోసం చేశారన్నారు. సీఎం జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు పేద విద్యార్థులకు ఆంగ్ల విద్యను అందిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ సంక్షేమానికి చిరునామాగా మారారన్నారు. అనంతరం మండలంలో కొత్తగా 216 మంది అర్హులకు మంజూరైన పింఛన్లను అందజేశారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లోమీడియా విష ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు వారిని నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమాణ్యం రెడ్డి, సర్పంచ్ హరిత, ఎంపీడీఓ కృష్ణయ్య, నాయకులు కుప్పయ్య, జనార్దన్, కాలప్ప, భూపతి, మణి, విజయాబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆపన్న హస్తం..

గంగాధరనెల్లూరు: కులమతాలకు అతీతంగా అభాగ్యులకు ఆపన్నహస్తం అందించి సీఎం జగనన్న ఆదుకుంటున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన ఎంపీపీ అనితారెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. సీఎం జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అన్ని హామీలు నెరవేర్చారన్నారు. అవ్వతాతలకు మనవడిగా, కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండి ఒకటో తేదీనే పింఛన్లను అందిస్తూ పేదల పక్షపాతిగా ఖ్యాతికెక్కారని కొనియాడారు. రాష్ట్రంలోని 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు హయాంలో పింఛన్ రావాలంటే లబ్ధిదారుడు మరణిస్తే తప్ప వచ్చేది కాదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ అనితారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబురెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, సురేంద్రరెడ్డి, కోదండన్, బాబునాయుడు, వెంకటరెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దారు ఇన్బనాథన్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



ఎంపీపీ శ్యామలను సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పాలసముద్రం : ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని ఎంపీపీ శ్యామల, పీహెచ్‌సీ చైర్మన్ శివప్రకాష్ రాజు అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ శ్యామల మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు విధిగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయ ఉద్యోగులు నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీపీని శ్యామలను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం సేవలు అందించండి

కార్వేటినగరం: అధికారులను ప్రజలకు నిత్యం సేవలు అందించాలని ఎంపీపీ లత అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాల్సింది అధికారులే అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటున్న అధికారులు సంక్షేమ పథకాలను అర్హులైన వారిని గుర్తించి అందించి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేసి ఆమోదం తెలిపారు. అలాగే అర్హులైన వారికి రేషన్ కార్డులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఉప సర్పంచ్ శాంతి, తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓ మణి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



వెదురుకుప్పంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సిబ్బంది



టీచర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రబాయి పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల బాలికలు చదువుల కోసం సావిత్రిబాయి శ్రమించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవకి, కుమారి నీరజ, శ్రీదేవి, సుజలచ గాయత్రి, స్వాతి, వరలక్ష్మి, వీరయ్య, నరసింహులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె, వెదురుకుప్పం జెడ్పీ హైస్కూళ్లలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెదురుకుప్పం స్కూల్ హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళల పాలిట ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండల పరిధిలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం జిల్లా ఎడుకేషన్ సెక్టోరల్ ఆఫీసర్ ఉదయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ సమక్షంలో జాతీయ మహిళ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, పాఠశాల స్థలదాత, మునిరత్నం నాయుడు, రిటైర్డ్ డీఈఓ శ్రీరాములు నాయుడు, జిల్లా ఎస్టీయూ నాయకుడు ఏలుమలై, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10న ఆశావర్కర్ల మహాసభ



పోస్టర్ విడుదల చేస్తున్న ఆశావర్కర్ల సంఘం నేతలు

వడమాలపేట : పుత్తూరులో ఈ నెల 10 వ తేదీన ఆశా వర్కర్ల మహాసభ నిర్వహించనున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య తెలిపారు. మంగళవారం వడమాలపేటలో ఆశా వర్కర్ల సమావేశం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహేష్, సుధారాణి, నవనీత పాల్గొన్నారు.

నేడు ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: అరుణగిరిపై వెలసని జ్ఞానప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం శివుడికి, నందీశ్వరుడికి ఏకకాలంలో అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

అవ్వతాతలకు అండగా సీఎం జగనన్న



సాతంబాకంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జయచంద్రారెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ఇచ్చిన మాటకు కట్టుబడి పెంచిన పింఛన్లు అందించి అవ్వతాతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని సాతంబాకం సర్పంచ్ కే.జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ యశోదరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో సంక్షేమ పథకాల ద్వారా వెలుగులు నింపుతున్నారని తెలిపారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని డీవైఈఓ రఘురామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్‌కేఎం పురం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో రూపురేఖలు మార్చుతున్నట్లు తెలిపారు. పాఠశాలలను అన్నిరకాలా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నాణ్యతతో కూడుకుని సకాలంలో పూర్తి చేసి వినియోగం తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంఈఓ విజయకుమార్, హెచ్‌ఎంలు తిరుపతయ్య ఉన్నారు.

పంటల్లో సస్యరక్షణ తప్పనిసరి



నారుమడులు పరిశీలిస్తున్న ఏఓ

కార్వేటినగరం : పంటల్లో సస్యరక్షణతో పాటు ఎరువుల యాజమాన్యం తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ అధికారి హేమలత అన్నారు. మంగళవారం డీఎం పురం, కొటార్వేడు, గోపిశెట్టిపల్లి ఆర్బీకేలకు వెళ్లిన ఆమె రిజిస్టర్లను తనిఖీ చేశారు. కేఎంపురంలో సాగు చేసిన వరిపంటను, నారుమడులను పరిశీలించి పాటించాల్సిన సస్యరక్షణ, ఎరువుల యాజమన్యంపై వివరించారు. ముఖ్యంగా నారు నాటే సమయంలో కొనలు తుంచి నాటడం వల్ల కాండం తొలుచు పురుగును నియంత్రించవచ్చన్నారు. సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం పాటిస్తే పంటలకు చీడపీడలు సోకకుండా చూడవచ్చన్నారు.

తిరుచ్చిపై వేణుగోపాలుడి కటాక్షం



పుర వీధుల్లో ఊరేగుతున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామివారు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అర్చకులు నారాయణదాసరి, గోపాలాచారి వేకుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో పాటు వేణుగోపాలున్ని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై వేంచేపు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ స్వామివారిని ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్‌బాబు, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబు గణేష్, టీటీడీ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వడమాలపేట : వైకుంఠ ద్వాదశి సందర్భంగా అప్పలాయిగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి పుష్కరిణిలో వైభవంగా చక్రస్నానం నిర్వహించారు. మంగళవారం వేకువజామున శ్రీవారిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు నివేదించారు. ఆలయ ఆవరణలోని కోనేరు వద్ద ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో చక్రత్తాళ్లార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారికి చక్రస్నానం జరిపించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

ధర్మరాజస్వామి గుడిలో తిరుప్పావై



ద్రౌపదమ్మ ఆలయం వద్ద అన్నదానం



ఆరేటమ్మ ఆలయం వద్ద ..

పుత్తూరు రూరల్: ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శల్య వైద్యులు సూరపరాజు గంగరాజు జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు ఎస్.కృష్ణమరాజు అన్నదానం చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, అర్చన చేశారు. సాయంత్రం డాక్టర్ సి.గోవిందస్వామి ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు. ఆరేటమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకొన్నారు. పి.గంగయ్య నీలమ్మ, పి.రామయ్య వరలక్ష్మి, పి.లోకేష్ యువరాజ్ అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్ రెడ్డి పర్యవేక్షించారు.

జల్లికట్టు నిషేధం



జల్లికట్టు నిషేధంపై ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

వెదురుకుప్పం: మండలంలో జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గోపీ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని వారపు సంతలో జల్లికట్టు, కోడె పందేలు, జూదం నిషేధం అని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల పేరుతో మూగజీవాలను హింసిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా జల్లికట్టు నిర్వాహణకు సంబంధించి ఎడ్లను రవాణా చేసినా చర్యలు తీసుకుని ఎడ్లను తిరుపతి గోశాలకు తరలిస్తామని చెప్పారు. గ్రామాల్లో ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల ప్రాణాలకు కలిగే ఆటలు, ఆస్తులకు నష్టం కలిగించే వ్యక్తులు, వారికి సహకరించిన బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు

నింద్ర: సంక్రాంతి సందర్భంగా ఎక్కడైనా జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన నింద్ర, విజయపురం మండలాలకు చెందిన గ్రామస్తులతో మాట్లాడారు. కోడి పందేలు, జూదం నిర్వహించినా కేసులు తప్పవని స్పష్టం చేశారు.

అర్హులందరికీ పింఛన్లు



మాట్లాడుతున్న సర్పంచ్ మురళీయాదవ్

పుత్తూరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందుతాయని, ఇందులో ఎవరికీ ఎలాంటి అపోహలు అవసరం లేదని శిరుగురాజుపాళెం సర్పంచ్ మురళీయాదవ్ తెలిపారు. మంగళవారం స్థానిక సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. మంత్రి ఆర్‌కే రోజా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్య అయినా వారి దృష్టికి తీసుకెళితే వెంటనే పరిష్కరిస్తారని వెల్లడించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీ పరిధిలోని మంచినీళ్ల గుంట, దాసరిగుంటలో జంగిల్ క్లీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలోనే చింత చెట్లు వేలం వేయనున్నట్లు చెప్పారు. పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సమావేశంలో ఉప సర్పంచ్ మురళి, వీఆర్‌ఓ రవికుమార్, కార్యదర్శి హరిత, ఏపీఓ భార్గవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదే



చెత్తాచెదారాలను తొలగిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పాలసముద్రం : గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదే అని ఎంపీడీఓ విద్యావతి, మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గ్రీన్‌అంబాసిడర్లు, ఆశా, పంచాయతీ కార్యదర్శులతో వారు సమీక్ష నిర్వహించారు. గతంలో కురిసిన వర్షాలకు ఇంటి పరిసరాల్లో నీరు చేరడంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. తద్వారా ప్రజలకు పలు రోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం పాలసముద్రంలో గ్రీన్‌అంబాసిడర్లతో చేయిస్తున్న పనులను మండల విస్తరణాధికారి రమేష్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.

'సుధాకర్ రెడ్డి మాటలు హాస్యాస్పదం'

వెదురుకుప్పం: కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నాడని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాంబేడు ఎంపీటీసీ మాజీ సభ్యుడు పొన్నాల గురవారెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డికి అతని సొంత ఊరిలో కూడా ఓటు వేయరని విమర్శించారు. అటువంటి వ్యక్తి చంద్రబాబు ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. అసలు కుప్పంలో చంద్రబాబే గెలిచే పరిస్థితి లేదని, ఆయనకే దిక్కులేనప్పుడు ఇతను పోటీ చేస్తానని గొప్పలు చెప్పుకోవడం అతని మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. టీడీపీ ఇతన్ని పావుగా వాడుకుని వదిలేయడం ఖాయమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం నారాయణస్వామిని విమర్శిస్తే మైలేజీ వస్తుందని భావిస్తూ సుధాకర్‌రెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాడని ఆరోపించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వంపై నిత్యం ఏదోరకంగా బురద జల్లాలని ప్రయత్నిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న వైద్యులు

వడమాలపేట : స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ రీసెర్చ్ టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార సమస్యలపై అవగాహన కల్పించారు. ఇలాంటి లక్షణాలతో ఎవరైనా బాధపడుతుంటే వారికి ట్రస్ట్ తరఫున ఉచితంగా వైద్యసేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, హేమంత్‌కుమార్, డాక్టర్ భార్గవ్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రెడ్డి కుమారి, స్టాఫ్ నర్స్ మెహతాజ్ పాల్గొన్నారు.